శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తుల స్వీకరణ
ఐటిడిఎ పిఒ సూర్యతేజ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

రాష్ట్ర ప్రభుత్వం డిఎస్‌సి ప్రకటన ఇచ్చిన నేపథ్యంలో ఐటిడిఎ, కెఆర్.పురం పరిధిలో గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు యువత కెఆర్‌పురం శిక్షణా కేంద్రం (వైటిసి)లో డే-స్కాలర్ (నాన్ రెసిడెన్షియల్) విధానంలో ఎస్‌జిటి పోస్టులకు శిక్షణ ఇచ్చేందుకు ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీ పరిధిలో ఆసక్తి గల గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులు కెఆర్‌పురం వైటిసిలో ఈ నెల 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కోచింగ్ క్లాసులు 17 నుంచి ప్రారంభిస్తారని, దరఖాస్తు కోసం అభ్యర్థులు వారి ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం డిఎస్‌సి రిజిస్ట్రేషన్ స్లిప్‌తో మేనేజర్ 9490285277 సంప్రదించాలని తెలిపారు.

నేతల మధ్య 'పొత్తు' కుదిరేనా..!

- టిడిపి, జనసేన అభ్యర్థుల మధ్య టిక్కెట్ రగడ
- నాకంటే.. నాకంటూ టిక్కెట్‌పై ఎవరి వాదన వారిదే
- ఎవరి ప్రచారం వారిదే అన్నట్లు నియోజకవర్గాల్లో వ్యవహారం
- సీట్ల పంపకం తర్వాత ఇరుపార్టీల పరస్పర సహకారంపై అనుమానాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిడిపి, జనసేన సీట్ల పంపకంలో నాయకుల మధ్య పొత్తు కుదిరేనా అనే చర్చ సర్వత్రా నడుస్తోంది. టిడిపి, జనసేన నాయకుల మధ్య చోటుచేసుకుంటున్న పరిణామాలు అందుకు అద్దం పడుతున్నాయి. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడిగా పోటీ చేయనున్నట్లు అధినాయకులు స్పష్టత ఇచ్చారు. సీట్ల పంపకంపై మాత్రం ఇప్పటికీ సస్పెన్స్ వీడలేదు. దీంతో టిక్కెట్ ఆశిస్తున్న ఇరు పార్టీల నేతల్లోనూ టెన్షన్ నెలకొంది. జనసేనకు జిల్లాలో ఎన్ని సీట్లు కేటాయిస్తారనేది తేలని పరిస్థితి ఉంది. బయట జరుగుతున్న ప్రచారం, వ్యక్తిగతంగా టిడిపి, జనసేన నాయకుల చర్చల్లో మాత్రం జనసేనకు జిల్లాలో ఐదు స్థానాలు కేటాయించే అవకాశం ఉన్నట్లు చెప్పుకుంటున్నారు. నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, కైకలూరు లేక ఏలూరు స్థానాలు కేటాయించనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇరుపార్టీల అధ్యక్షుల్లో ఎన్నికల పొత్తుపై స్పష్టత వచ్చినప్పటికీ టిక్కెట్ల విషయంలో మాత్రం క్షేత్రస్థాయిలో నాయకుల మధ్య పొత్తు కుదిరే పరిస్థితి లేకుండా పోయిందనే చర్చ నడుస్తోంది. నరసాపురం టిక్కెట్ జనసేన తరపున బొమ్మిడి నాయకర్‌కు ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. ఆయన ప్రచారానికి ఏర్పాట్లు సైతం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇంతలో టిడిపి నాయకులు, శాసనమండలి మాజీ ఛైర్మన్ షరీఫ్ నాలుగు రోజుల క్రితం మాట్లాడుతూ నరసాపురం టిక్కెట్ ఎవరికీ కేటాయించలేదని, టిడిపి నాయకులు ఆందోళన చెందొద్దంటూ సమాధానమిచ్చారు. టిడిపి తరపున టిక్కెట్ ఆశిస్తున్న వారిలో మాజీ ఎంఎల్‌ఎ మాధవనాయుడు, కొవ్వలి రామ్మోహన్‌నాయుడు, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ఉన్నారు. ఒకవేళ బొమ్మిడి నాయకర్‌కు టిక్కెట్ కేటాయించినా టిడిపి నాయకులు సహకరిస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. భీమవరంలో జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ పోటీ చేయనున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఇక్కడ టిడిపి నాయకులు తోట సీతారామలక్ష్మి, కోళ్ల నాగేశ్వరరావు మధ్య రాజకీయ వైరం నడుస్తోంది. పవన్‌కళ్యాణ్ పోటీ చేస్తే టిడిపి నేతలు సహకరించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉంగుటూరు నియోజకవర్గంలో టిడిపి తరపున గన్ని వీరాంజనేయులు, జనసేన నుంచి పత్సమట్ల ధర్మరాజు ఉన్నారు. ధర్మరాజు ఐదేళ్లుగా జనసేన తరపున పని చేస్తున్నారు. టిక్కెట్ కేటాయింపు తనకే అంటూ గన్ని, కాదు తనకే అంటూ ధర్మరాజు ఎవరి వారు కార్యకర్తలకు చెబుతున్నారు. పొత్తులో భాగంగా బిజెపికి కేటాయించే అవకాశం ఉందనే మరో వాదన సైతం వినిపిస్తోంది. టిక్కెట్ ఎవరికి కేటాయించినా వేరే వారు సహకరించే పరిస్థితి ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏలూరు విషయానికి వస్తే ఇక్కడ టిడిపి తరపున బడేటి చంటి, జనసేన నుంచి రెడ్డి అప్పలనాయుడు ఉన్నారు. కొత్తగా జనసేన నుంచి పోటీలో ఉన్నట్లు నారా శేషు హడావుడి చేస్తున్నారు. దీంతో టిక్కెట్ కేటాయింపుల పూర్తయిన తర్వాత ఇరుపార్టీల నేతల మధ్య సహకారం ఉంటుందా అనే అనుమానాలు ఉన్నాయి. తాడేపల్లిగూడెంలో టిడిపి తరపున వలవల బాబ్జి, జనసేన నుంచి బొలిశెట్టి శ్రీనివాస్ టిక్కెట్ ఆశిస్తున్నారు. ఇక్కడ ఏ పార్టీకి కేటాయించినా మరోపార్టీ సఖ్యత ఉంటుందో, లేదో తెలియని పరిస్థితి నెలకొంది. టిక్కెట్ల కేటాయింపులో నెలకొన్న జాప్యం ఇరుపార్టీల నాయకుల మధ్య విభేదాలు మరింత పెంచుతోంది. దీంతో టిక్కెట్ కేటాయింపు తర్వాత నాయకుల మధ్య పొత్తు కుదిరేనా అనే చర్చ పెద్దఎత్తున నడుస్తోంది.

16న బంద్ విజయవంతం కోరుతూ బైక్‌ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

బైక్ ర్యాలీలో నేతలు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న జరగనున్న పారిశ్రామిక సమ్మె-గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ కార్మిక, రైతుసంఘాల ఆధ్వర్యంలో ఏలూరులో బుధవారం సాయంత్రం బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నుండి ప్రారంభమై గడియార స్తంభం మీదుగా పెద్ద పోస్టాఫీస్, జ్యూట్‌మిల్లు, ఫైర్ స్టేషన్ సెంటర్ గుండా విజయ విహార్ సెంటర్ మీదుగా పవర్ పేట రైల్వే స్టేషన్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ముంగాపు అప్పారావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసడాంగే, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. ఢిల్లీలో రైతాంగం పెద్ద ఎత్తున పోరాడుతుంటే మోడీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ బాష్ప వాయువు ప్రయోగించి రైతు ఉద్యమాన్ని అణిచేసేలా చేపడుతున్న చర్యలను తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు పుప్పాల కన్నబాబు, ఎ.అప్పలరాజు, బద్దా వెంకట్రావు, ఎం.క్రాంతికుమార్, బి.జగన్నాథం, వి.సాయిబాబు, గోపి, జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌కు వినతిపత్రం అందిస్తున్న జెఎసి నేతలు

ఉద్యోగుల ఆర్థిక బకాయిలు చెల్లించాలి
జెఎసి ఆధ్వర్యాన కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగుల ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జెఎసి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జెఎసి జిల్లా ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిల కోసం ఇప్పటికే అనేక దఫాలుగా ఆందోళనలు చేశామని గుర్తు చేశారు. అయినా ప్రభుత్వం సరిగా స్పందించకపోవడంతో దశలవారీ ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని, 12వ పిఆర్‌సి ఇచ్చేలోపు మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. జెఎసి కన్వీనర్ నెరుసు రామారావు, నేతలు రవికుమార్ రుద్రాక్ష, ముస్తఫా అలీ, పివి.నర్సింహారావు, ఆంజనేయులు, గగులోతు కృష్ణ, శ్రీధర్‌రాజు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

జీలుగుమిల్లి :ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు బుధవారం నల్ల బ్యాడ్జిలు ధరించి విధులకు హాజరయ్యారు. ఆర్థిక బకాయిలు, పిఆర్‌సి, ఐఆర్ 30 శాతం వంటి పలు డిమాండ్లపై నిరసన వ్యక్తం చేసినట్లు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండలాధ్యక్షురాలు పోసమ్మ, సోమేశ్వరరావు, భవానిశంకర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


జీలుగుమ్మిలి:నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఓట్ల తొలగింపు దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక బృందాలు
రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

నియోజకవర్గ పరిధిలో ఫారం-7కి దరఖాస్తులు 0.1 శాతంకన్నా ఎక్కువ వస్తే ఆ ఓట్ల తొలగింపు పరిశీలనకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఏలూరు జిల్లా ఓటర్ల జాబితాలోని అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో బుధవారం ఆయన సమావేశమయ్యారు. సమావేశంలో డిఆర్‌ఒ డి.పుష్పమణి, కలెక్టరేట్ ఎఒ కె.కాశీవిశ్వేశ్వరరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు డి.రత్నబాబు (బిఎస్‌పి), నెరుసు నెలరాజు (బిజెపి), పి.ఆదిశేషు (సిపిఎం), ఆర్.సత్యనారాయణ (ఆమ్‌ఆద్మీ), పాలి ప్రసాద్ (టిడిపి), కలవకొల్లు సాంబ (వైసిపి) తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల విడుదల చేసిన తుదిఓటర్ల జాబితా పరిశీలించింది, లేనిదీ ఆయా రాజకీయపక్షాల ప్రతినిధులను కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఫారం-7కి దరఖాస్తులు 0.1 శాతంలోపు, పైన ఉంటే వాటిని పరిశీలించేందుకు జిల్లాస్థాయిలో డిప్యూటీ కలెక్టర్లతో కూడిన రెండు బృందాలను నియమించామన్నారు. కమిటీ పరిశీలన అనంతరం సంబంధిత ఓట్ల తొలగింపునకు జిల్లా ఎన్నికల అధికారిగా తాను చర్యలు తీసుకుంటానన్నారు. అదే 0.1 శాతంకన్నా ఎక్కువ దరఖాస్తులు వస్తే ఆ ఓట్లను తొలగించాలంటే రాష్ట్రస్థాయిలో కమిటీ పరిశీలించి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి సమర్పిస్తామన్నారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా నిర్దేశించిన సంఖ్య మేరకు అనుబంధ పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందజేయాలని రాజకీయపక్షాల ప్రతినిధులను ఆయన కోరారు. సంబంధిత వివరాలు ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులకు అందజేస్తే సంబంధిత బృందాలతో పరిశీలించి అనుబంధ పోలింగ్ స్టేషన్లకు అవసరమైతే ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపుతామన్నారు. జిల్లాలో తుది ఓటర్ల జాబితా విడుదల నాటికి 16,24,416 ఓట్లు నమోదవ్వగా అనంతరం కొత్తగా దరఖాస్తు చేసిన వాటి పరిశీలన అనంతరం నేటికి 16,25,618కు చేరిందన్నారు. జిల్లాలో ఫిబ్రవరి 14వ తేదీ నాటికి అందిన దరఖాస్తుల్లో 17,010 పరిశీలనలో ఉన్నాయన్నారు. వాటిలో ఫారం-6 కింద 4,034, ఫారం-7 కింద 7,562, ఫారం-8 కింద 5,414 పరిశీలనలో ఉన్నాయన్నారు. వీటన్నింటినీ త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇవి సప్లిమెంట్ ఓటర్ల జాబితాలో చేర్చుతామన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ఎన్నికల సమయంలో మరింత అప్రమత్తత అవసరం
ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసులు
పోలీసు సిబ్బందికి విధులపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఎన్నికల సమయం సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు విధుల పట్ల మరింత అప్రమత్తత కలిగి ఉండాలని ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని హేలాపురి, రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలల్లో నూజివీడు సబ్ డివిజన్ పోలీసు అధికారులతో, కైకలూరు, నిడమర్రు పోలీసు సిబ్బందితో ఎన్నికల నేపథ్యంలో వారు నిర్వహించే విధులపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. హేలాపురి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన తర్ఫీదు కార్యక్రమానికి సిసిఎస్‌సి మురళీకృష్ణ ఇన్‌ఛార్జిగా వ్యవహరించుగా, రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన తర్ఫీదు కార్యక్రమానికి ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసులు ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కోడ్ ఆఫ్ కండక్టర్ రూల్స్‌ను పాటించాలని, ఎన్నికల సమయంలో నిస్వార్థంగా పని చేయాలని సూచించారు. నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఎన్నికల సమయంలో పోలీసులు నిర్వహించే విధులు ప్రజాస్వామ్యాన్ని ప్రతిబింబించేలా ఉండాలని చెప్పారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించిన బెదిరించడానికి ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇవిఎంలో భద్రత వాటి రవాణా అంశంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ర్యాలీలు, నిరసనలు జరగకుండా చూడాలని సూచించారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని చెప్పారు. పోలీసు ప్రతిష్టను మరింత ఇనుమడింపచేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారి

ఎంఎస్‌ఎంఇ యూనిట్లను ప్రోత్సహించాలి
కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం కింద అందిన దరఖాస్తుల్లో అత్యధికం తిరస్కరణపై కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సమీక్షా కమిటీ (డిసిసి) నాల్గో త్రైమాసిక బ్యాంకర్ల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ (పిఎంఇజిపి) కింద ఉపాధి కల్పనకు ఎంతో ప్రాధాన్యతనిస్తున్నప్పటికి అందుకు సంబంధించి వివిధ బ్యాంకులకు 580 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిలో 223 తిరస్కరణకు గురికావడం, వాటిలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకునే 117 దరఖాస్తులను తిరస్కరించడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. అదే విధంగా మరో 79 దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టారని, దీనికి గల కారణాలను దరఖాస్తువారీగా నివేదిక రూపొందించి వచ్చే సమావేశం నాటికి సమర్పించాలని సంబంధిత బ్యాంకు అధికారులను ఆదేశించారు. జిల్లాలో అర్బన్ ప్రాంతంతోపాటు గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఇ) యూనిట్లు నెలకొల్పేందుకు బ్యాంకర్లు అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు. ముఖ్యంగా ఐటిడిఎ ప్రాంతంలో యూనిట్ల స్థాపనకు సంబంధిత బ్యాంకర్లతో ఐటిడిఎ పిఒతో కలిసి సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఎంఎస్‌ఎంఇ కింద పాతయూనిట్ల విస్తరణకు రుణ మంజూరు చేయడమే కాకుండా కొత్త యూనిట్ల ఏర్పాటుకు అత్యధిక ప్రోత్సాహం అందించాలని, ఆ దిశగా చర్యలు ముమ్మరం చేయాలని అన్నారు. వచ్చే సమావేశం నాటికి ఎంఎస్‌ఎంఇ కింద ఆయా బ్యాంకులవారీ కొత్త యూనిట్లు ఎన్ని మంజూరు చేసింది, సంబంధిత యూనిట్లను నెలకొల్పడం ద్వారా ఎంతమంది ఉపాధి పొందింది వివరాలు అందించాలని సూచించినప్పటికీ 2, 3 బ్యాంకులు తప్ప మిగిలిన వారు స్పందించకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే పనితీరు కనిపిస్తే సంబంధిత విషయాన్ని ఎస్‌ఎల్‌బిసి దృష్టికి తీసుకెళ్లాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. పిఎంఇజిపి కింద మరి ముఖ్యంగా తాడువాయి ప్రాంతంలో ఉపాధి యూనిట్లు నెలకొల్పేందుకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. వైఎస్‌ఆర్ జగనన్న బడుగు వికాసం కింద సర్వీసు, తయారీ రంగాల్లో ఉపాధియూనిట్లు నెలకొల్పేందుకు ఎస్‌సి, ఎస్‌టిలకు 45 శాతం సబ్సిడీతో కూడిన రుణాలను అందిస్తామని, వీటిని ఆయా తరగతులు సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలని అన్నారు. డిసిసి కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎం.గోపాలకృష్ణమూర్తి, ఆర్‌బిఐకి చెందిన ఎల్‌డిఒ పూర్ణిమ మాట్లాడుతూ ప్రతి బ్యాంకు శాఖ నిర్దేశిత లక్ష్యాలు చేరుకునే విధంగా అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజరు డి.నీలాద్రి గత సమావేశంలో తీర్మానించిన అంశాలపై తీసుకున్న చర్యలను, ఆయా బ్యాంకుల వారీగా లక్ష్యాలు, సాధించిన పురోగతిని వివరించారు. వివిధ బ్యాంకుల జిల్లా కోఆర్డినేటర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శనీయులు దామోదరం సంజీవయ్య

మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ఆదర్శనీయులని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. దామోదరం సంజీవయ్య 103వ జయంతిని పురస్కరించుకుని బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ అధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో దామోదరం సంజీవయ్య చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య క్రమశిక్షణ, పట్టుదల, ఓర్పు, సహనంతో అనేక విజయాలు సొంతం చేసుకున్నారన్నారు. అలాంటి వాటిని నేటితరం ఆయుధాలుగా మలుచుకుని అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ డి.పుష్పమణి, సోషల్ వెల్ఫేర్ జెడి జయప్రకాష్, కలెక్టరేట్ ఎఒ కె.కాశీవిశ్వేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి ఎన్ఎస్.కృపావరం, మెప్మా పీడీ ఇమ్మానుయేల్, దళిత నాయకులు పొలిమేర హరికృష్ణ, మట్టా రాజు, ప్రవల్లిక, మేతర అజయ్‌బాబు, మెండెం సంతోష్ కుమార్, జంగా మధుసూదనరావు, పరిసిపోగు బాలరాజు, అంద్రి డోమిక్ పాల్గొన్నారు.

నూజివీడు డిఎస్‌పిగా మురళీకృష్ణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు డిఎస్‌పిగా చిటికెన మురళీకృష్ణ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆయన స్థానంలో ఉన్న అశోక్‌కుమార్‌గౌడ్‌ను విజయవాడ ట్రాఫిక్‌కు బదిలీ చేశారు. మచిలీపట్నంలో సిసిఎస్‌లో పనిచేస్తున్న మురళీకృష్ణ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు బదిలీపై నూజివీడుకు వచ్చారు.

సెక్టార్-1 ఎస్‌ఐగా మూర్తి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

సెక్టార్ వన్ ఎస్‌ఐగా కెఎస్ఎన్.మూర్తి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ నుంచి నూజివీడు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ ఉన్నతాధి కారుల ఆదేశంతో పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు.

రోడ్లపై గుంతలు పూడ్చివేత
సిఐ సుధాకర్‌కు ప్రజల అభినందన

ప్రజాశక్తి - చింతలపూడి

రోడ్డుపై గుంతలు పూడ్పిస్తున్న సిఐ

రోడ్లపై గుంతలను పూడ్పించిన చింతలపూడి సిఐ సుధాకర్‌ను ప్రజలు అభినందిస్తున్నారు. చింతలపూడి నగరపంచాయతీలో రోడ్లు వేయడానికి, గుంతలు పూడ్చడానికి నిధులు లేవని అధికారులు చెప్పారు. గుంతల కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుని ప్రాణాలు కోల్పోతున్నా రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవడంలేదు. కనీసం రోడ్డుపై గుంతలను పూడ్చడంలేదు. ఈ క్రమంలో చింతలపూడి సిఐ రోడ్లపై గుంతలను పడ్పించారు. దీంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన అల్లిపల్లి తిరునాళ్ల సమయంలో యర్రగుంటపల్లి రహదారి గుంతలు, తాజాగా పట్టణంలో రోడ్లపై గుంతలు పూడ్పించారు. సిఐ సుధాకర్‌ను పట్టణంలోని స్వచ్ఛంద సంస్థలవారు, ప్రెస్‌క్లబ్, ప్రజలు అభినందిస్తున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి బి.ప్రభాకరరావు తెలిపారు. 54 కేంద్రాల్లో సాధారణ ప్రాక్టికల్స్, 16 కేంద్రాల్లో వృత్తివిద్య ప్రాక్టికల్స్ జరిగినట్లు ఆయన తెలిపారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు 2,846 మందికి 2,764 మంది హాజరు కాగా 822 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన పరీక్షలకు 2,463 మందికి 2,435 మంది హాజరు కాగా 28 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు.

మత్స్యకార వృత్తులను ప్రోత్సహించేందుకు కృషి
గోదావరిలో చేప పిల్లలను వదిలిన ఎంపిపి వెంకటరెడ్డి

ప్రజాశక్తి - పోలవరం

మత్స్యకారుల వృత్తులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నదుల్లో చేప పిల్లలు విడుదల చేసే కార్యక్రమాన్ని చేపట్టిందని పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి అన్నారు. మండలంలో గూటాల, పాత పోలవరం గ్రామాల వద్ద గోదావరి నదిలో చేప పిల్లలు విడుదల చేసే కార్యక్రమాన్ని మత్స్య శాఖాధికారులు బుధవారం చేపట్టారు. ఎంపిపి సుంకర వెంకటరెడ్డి నదిలో చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులను ప్రోత్సహించేందుకు, ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగానే గోదావరి నదిలో చేప పిల్లలను వదిలినట్లు చెప్పారు. అనంతరం డిఎఫ్ నాగలింగాచార్యులు మాట్లాడుతూ నదుల్లో సహజంగా ఏర్పడే మత్స్యసంపద మత్స్యకారుల జీవనోపాధికి సరిపోదని, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో ఏలూరు, బాదంపూడి మత్స్యకేంద్రాల నుంచి సుమారు రూ.40 నుంచి రూ.60 లక్షల విలువైన 21.10 లక్షల చేప పిల్లలను గోదావరి నదిలో వదిలినట్లు చెప్పారు. దీంతో స్థానికంగా ఉన్న మత్స్యకారులకు జీవనోపాధి మెరుగుపడుతుందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి జాలర్లు వచ్చి చిన్న వలలతో చిన్న చిన్న చేపలను పడుతున్నట్లు కలెక్టర్ దృష్టికి వచ్చిందని, ఇక్కడ పరిస్థితులను పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి చేపల వేటకు వచ్చేవారిని అరికట్టేందుకు అన్నివిధాలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖాధికారి కెఎస్‌వి.నాగలింగాచార్యులు, బాదంపూడి సహాయ సంచాలకులు బి.నర్సయ్య, పోలవరం మత్స్య శాఖ సహాయ తనిఖీ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, ఏలూరు ఎఫ్‌డిఒ దివ్య, విఎఫ్‌ఎలు ఎస్.జయ, సుధ లక్ష్మి, కె.సుబ్రహ్మణ్యం, గూటాల సొసైటీ అధ్యక్షులు సుంకర అంజిబాబు, విఆర్‌ఒ బి.వినయ్‌కుమార్, మత్స్యకారులు పాల్గొన్నారు.

గోదావరి నదిలోకి చేప పిల్లలు వదులుతున్న ఎంపిపి

నేడు మోటార్ సైకిల్ ర్యాలీ
రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా
ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి

ప్రజాశక్తి - ఏలూరు

35వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 15వ తేదీ ఉదయం 8:30 గంటలకు ఏలూరు శాంతినగర్‌లోని పోలీస్ పెట్రోల్ బంకు నుంచి మోటార్ సైకిల్ ర్యాలీ ప్రారంభమవుతుందని ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీలో రవాణా, పోలీస్ శాఖలు, పట్టణంలోని ద్విచక్ర వాహన డీలర్లు పాల్గొంటారని తెలిపారు. ఈ ర్యాలీలో పాల్గొనదల్చిన ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి పాల్గొనాలని, ప్రతిఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు.

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి

ప్రజాశక్తి - మండవల్లి

వృద్ధాప్య, వితంతు పెన్షన్లను ప్రవేశపెట్టి పేదలకు విలువైన సేవలం దించిన అత్యంత నిజాయితీపరుడు దామోదరం సంజీవయ్య అని డాక్టర్ అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు శాంతారాం, మాజీ అధ్యక్షులు ఎల్ఎస్. భాస్కరరావు స్పష్టం చేశారు. దామోదరం సంజీవయ్య 103వ జయంతి కార్యక్రమాన్ని స్థానిక సెంటర్లో బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యం లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన సేవలు నేటి యువతకు ఆదర్శమ న్నారు.

ఎపిపిగా గాంధీ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు అసిస్టెంట్ సేషన్ జడ్జి కోర్టుకు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్గా జంగం వేదాస్ గాంధీ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ మేరకు నియామకమయ్యారు. ఈ ఉద్యోగంలో గాంధీ మూడేళ్ల పాటు కొనసాగుతారు. గతంలో 2005 నుంచి 2012 వరకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్గా విధులు నిర్వహించారు.

ఇళ్ల స్థలాలు పేదలకే ఇవ్వాలని ఆందోళన

ప్రజాశక్తి - మండవల్లి

పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని కోరుతూ కానుకొల్లు విఆర్ఓ కార్యాలయం ఎదుట టిడిపి ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి బూత్ ఇన్చార్జి కోసూరి మాణిక్యాలరావు ఎలిమెల్ల మధురాజు మాట్లాడారు. అర్హులకు కాకుండా ఆస్తులు లేనివారికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడం దారుణమన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని, అప్పటివరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి గూడవల్లి కోటేశ్వరరావు, టిడిపి నాయకులు విజిఎస్.మాల్యాద్రి, వీరపల్లి శివయ్య, తలారి రాజేష్, జోసఫ్ తంబి, రాయగిరి రాము, విష్ణు మూర్తుల రాంబాబు పాల్గొన్నారు.

రైతులపై నిర్బంధ చర్యలు దుర్మార్గం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతులు శాంతియుతంగా నిర్వహిస్తున్న చలో ఢిల్లీపై కేంద్ర ప్రభుత్వం నిర్బంధ చర్యలకు దిగి దమనకాండకు పాల్పడటం దుర్మార్గమని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డేగా ప్రభాకర్ విమర్శించారు. స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డేగా ప్రభాకర్ మాట్లాడారు. మోడీ ఇచ్చిన హామీ ప్రకారం మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో రుణ విమోచన చట్టం తీసుకొచ్చి దేశవ్యాప్తంగా రైతుల రుణాలు మాఫీ చేయాలన్నారు.

రోడ్డు నియమ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి.నాగమురళి చెప్పారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భం గా పట్టణంలో బుధవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. నాగమురళి మాట్లాడు తూ ఆటోల ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు.

పాఠశాలలో అక్షరాభ్యాసం

ప్రజాశక్తి - భీమడోలు

అన్నేవారిగూడెం ఎంపిపి ప్రాథమికోన్నత పాఠశాలలో వసంత పంచమి ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా జరుపుతున్న నేపథ్యంలో నూతనంగా చేరేందుకు వచ్చిన 12 మంది విద్యార్థులకు బుధవారం అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు షేక్ మస్తాన్ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సర్వే సందర్భంగా వీరందరూ పాఠశాలలో చేరాల్సి ఉన్నట్లు గుర్తించామన్నారు. నూతనంగా చేరేందుకు వచ్చిన విద్యార్థులకు సంప్రదాయ రీతిలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

వీణల తయారీ, సంగీతంలో శిక్షణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

వీణల తయారీ, వీణ వాయిద్య సంగీతంలో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి గంటా సుధాకర్ తెలిపారు. మండలంలోని తుక్కులూరులో శిక్షణ కేంద్రం ఏర్పాటుకు బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో ఉపకార వేతనం ఇవ్వనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు తహశీల్దార్ ఎవి.శాస్త్రి, స్కిల్ డెవలప్మెంట్ కో-ఆర్డినేటర్ రామకృష్ణ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - చింతలపూడి

మృతి చెందిన వారి పేద కుటుంబాలకు నా గ్రామం నా సాయం కార్యక్రమం ద్వారా సహాయం చేస్తామని రెయిన్బో ఫార్మా ఎండి తాళ్లూరి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రగడవరం పంచాయతీ శివారు మెట్టగూడెంలోని గంధం సత్యం మృతి చెందారు. ఆయన కుటుంబానికి నా గ్రామం నా సాయం కార్యక్రమం ద్వారా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.ఐదు వేలు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి ఎవరైె నా మృతి చెందితే ఆ కుటుంబాలకు రూ.ఐదు వేలు అందించనున్నట్లు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - ముసునూరు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని గోపవరం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పాముల దానియేలు పూరిల్లు బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో దగ్ధమైంది. బాధిత కుటుంబానికి టిడిపి నేత ఉప్పలపాటి గణేష్ 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందించారు.

రేషన్ దుకాణంలో తనిఖీలు

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని గొమ్ముగుడెం పంచాయతీ రామచంద్రాపురంలో ఉన్న రేషన్ షాపులో అధికారులు బుధవారం తనిఖీ చేశారు. నిల్వలో అవకతవకలు ఉండడంతో దుకాణానికి సీల్ వేసి రేషన్ డీలర్పై కేసు నమోదు చేశారు. తమకు సమయానికి బియ్యం ఇవ్వడం లేదని, కందిపప్పు కూడా ఇవ్వడం లేదని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - టి.నరసాపురం

నాటుసారా తయారు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మధ్యాహ్నపువారిగూడెం గ్రామ శివార్లలో నాటుసారా తయారు చేస్తున్నారనే సమా చారం మేరకు పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 20 లీటర్ల నాటుసారా, నాటుసారా తయారు చేసే సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. సారా తయారుచేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

వాడవల్లిలో చోరీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వాడవల్లిలో చోరీ జరిగినట్లు ముదినేపల్లి ఎస్ఐ డి.వెంకట్కుమార్ తెలిపారు. వాడవల్లి గ్రామానికి చెందిన దూసనపూడి గురుబ్రహ్మం ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న రూ.2.3 లక్షల నగదు అపహరించుకుపోయారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తెడ్లంలో...

టి.నరసాపురం : బంగారం చోరీ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తెడ్లం గ్రామానికి చెందిన కేతిరెడ్డి సత్యనారాయణరెడ్డి హైదరాబాద్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ తెడ్లంలోని తన ఇంటికి వచ్చి బీరువా చూడగా అందులో ఉండాల్సిన తొమ్మిది కాసుల బంగారం కనిపించలేదు. అదే గ్రామానికి చెందిన వ్యక్తిపై అనుమానం ఉందని సత్యనారాయణరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

విద్య, వైద్యం, ఉపాధి కల్పనే ప్రధాన లక్ష్యం

వైసిపి నియోజకవర్గ ఇన్ఛార్జి కంభంపాటి విజయరాజు

చిట్ చాట్

ప్రజాశక్తి - చింతలపూడి

"విద్య, వైద్యం, ఉపాధి ప్రధాన లక్ష్యంగా చింతలపూడి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మొదటి స్థానానికి తీసుకురావాలనేదే నా సంకల్పం. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆలోచనా విధానాలకు అనుగుణంగా.. డాక్టర్ వైఎస్.రాజశేఖర్రెడ్డి, కోటగిరి విద్యాధరరావు స్ఫూర్తితో సిఎం జగన్పై అభిమానంతో, ఆయన అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజల వద్దకు పాలన చూసి రాజకీయాల్లోకి వచ్చాను. చింతలపూడి నగర పంచాయతీని మోడరన్గా తీర్చిదిద్దాలనే ఆశయంతో ఉన్నాను. నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాను. చింతలపూడి నియోజకవర్గాన్ని గెలిపించి సిఎం జగన్కు బహుమతి ఇవ్వాలి" అని అంటున్న వైసిపి చింతలపూడి నియోజకవర్గ ఇన్ఛార్జి కంభంపాటి విజయరాజుతో ప్రజాశక్తి ఇంటర్వ్యూ.

కుటుంబ నేపథ్యం

మాది చింతపూడి నియోజకవర్గం లింగపాలెం మండలం అనపనేనివారిగూడెం. తండ్రి కంభం ప్రకాష్, తల్లి మేరీ సరస్వతి. బాల్యం మొత్తం కామవరపుకోట మండలంలో సాగింది. 1963లో ఆర్టిసి సూపర్వైజర్గా ఉద్యోగం వచ్చింది. అప్పటినుంచి 1994 వరకు పనిచేశాను. 1994లో సర్వీస్ కమిషన్ ద్వారా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టాను. ఏలూరు, కాకినాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో పనిచేశాను.

రాజకీయాల్లోకి రావడానికి కారణం ఏమిటి?

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ను స్ఫూర్తిగా భావించి ఉన్నత విద్యనభ్యసించి ఉన్నత పదవులను అధిరోహించి ఉన్నత జీవన విధానం అవలంభించాలి. రాజ్యాధికారం వస్తే అందిపుచ్చుకొని ప్రజలకు సేవ చేయాలి. డాక్టర్ వైఎస్.రాజశేఖర్రెడ్డి మరణం ప్రజలకు, రాష్ట్రానికి తీరని లోటు. ఆయన స్ఫూర్తి, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు నాలో స్ఫూర్తిని నింపాయి. కోటగిరి విద్యాధరరావు కూడా నాకు స్ఫూర్తి. వైఎస్.జగన్మోహన్రెడ్డి ప్రజల వద్దకు పాలన తీసుకొచ్చారు. ఇచ్చిన హామీలను, నవరత్నాలను ప్రజలకు అందించారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయి. అదేవిధంగా నాక్కూడా ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన వచ్చింది. ఆ ఆలోచనతోనే రాజకీయాలకు వచ్చాను.

2024 ఎన్నికల్లో అధికారంలోకొస్తే నియోజకవర్గ అభివృద్ధిపై ఏ విధంగా దృష్టి పెడతారు?

చింతలపూడి ఎత్తిపోతల పథకంపై ప్రత్యేక దృష్టి సారిస్తాను. రైతులకు కచ్చితంగా న్యాయం చేస్తాను. నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తాను. చింతలపూడి నగర పంచాయతీకి నిధులు తీసుకొచ్చి రాష్ట్రంలోనే ఒక మోడల్ సిటీగా తయారు చేస్తాను. విద్య, వైద్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తాను. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాను. హైదరాబాదులో ఉన్న ఫార్మసీ, ఇతర కంపెనీలతో మాట్లాడి చింతలపూడికి తీసుకొచ్చేలా ప్రోత్సహించి పరిశ్రమలు ఏర్పాటు చేసేలా కృషి చేస్తాను. వంద పడకల ఆసుపత్రి త్వరగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందే విధంగా కృషి చేస్తాను. నియోజకవర్గాన్ని ఏ విధంగా అభివృద్ధి చేస్తే ప్రజలకు మేలు కలుగుతుందో నిర్ణయాలు తీసుకుని అదే విధంగా పని చేస్తాను.

మీరు స్థానిక వ్యక్తి అవ్వడం వల్ల ప్రయోజనాలు ఏంటి?

నేను లోకల్ అవ్వడం వల్ల నియోజకవర్గంలో ప్రత్యేక పరిచయాలు ఉన్నాయి. బంధువులు, స్నేహితులు ఎక్కువగానే ఉన్నారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్గా పని చేసినప్పుడు నియోజకవర్గంలో ప్రతి వ్యక్తితో వ్యక్తిగత పరిచయాలు ఉన్నాయి. నియోజకవర్గంపై ప్రత్యేక పట్టు ఉంది. నియోజవర్గ నాయకులను, కార్యకర్తలందరిని కలుపుకుని ముందుకు వెళ్తాను.

యువతకు మీరిచ్చే సందేశం ఏమిటి?

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చెప్పినట్లుగా ఉన్నత స్థాయికి రావడానికి కష్టపడాలి. రాజకీయాలపై యువత అవగాహన కలిగి ఉండాలి. ఓటు అనేది చాలా విలువైనది. అభివృద్ధి చేసేవారికే ఓటు వేయండి. సంక్షేమానికి, అభివృద్ధికి ఓటేయ్యండి.

ప్రస్తుతం నియోజకవర్గ సమస్యలపై దృష్టి పెట్టరా?

రోడ్లపైన దృష్టి పెట్టాను. పార్టీ పెద్దలతో, నాయకులతో మాట్లాడి నిధులు తీసుకొచ్చి రోడ్ల మరమ్మతులు చేయిస్తాను. సాధ్యమైనంతవరకు ఎన్నికలకు ముందే కొన్ని సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తాను.

నియోజకవర్గ ప్రజలకు మీరేం చెప్పదలుచుకున్నారు?

గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి మధ్య తేడా చూడండి. ప్రజల వద్దకు పాలన తీసుకొచ్చిన ఘనత సిఎం జగన్దే. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారు. అర్హులందరికీ లబ్ధి చేకూరింది. మహిళాభ్యున్నతికి పెద్దపీట వేశారు. 2024 ఎన్నికల్లో చింతలపూడి నియోజకవర్గాన్ని సిఎం జగన్కు బహుమతిగా ఇవ్వాలి.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

16న గ్రామీణ బంద్, సమ్మె జయప్రదానికి పిలుపు



భీమడోలు: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న లింగరాజు, కార్మికులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

డ్రైవర్లకు ఉరితాడు వంటి ప్రమాదకర బిఎన్ఎస్ 106 హిట్ అండ్ రన్ చట్టాన్ని బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 16న దేశవ్యాప్త సమ్మెలో రవాణా రంగ కార్మికులందరూ పాల్గొనాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి జె.గోపి విజ్ఞప్తి చేశారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఫెడరేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రిటిష్ చట్టాలు రద్దుచేసి భారతీయ చట్టాలను తీసుకొస్తామని చెప్పి, డ్రైవర్లను తమ వృత్తి నుంచి గెంటివేసే పద్ధతిలో మోడీ ప్రభుత్వం చట్టాలను తీసుకువచ్చిందని విమర్శించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ రవాణా రంగ కార్మికులకు వారి కుటుంబాలను రక్షించే విధంగా, సమగ్ర సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని, రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. .

భీమడోలు : ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో 16వ తేదీన నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు తెలిపారు. సన్నాహక చర్యలను పరిశీలించేందుకు భీమడోలు మండలంలో బుధవారం సాయంత్రం ఆయన పర్యటించి పలువురిని కలిశారు. పూళ్ల రైస్ మిల్లు వద్ద కార్మికులతో కలిసి సమ్మె కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు బెండి శ్రీనివాసరావు, కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మండల కేంద్రం కొయ్యలగూడెం హై స్కూల్ ఆవరణలో సిఐటియు మండల సమావేశాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 16వ తేదీన జరగబోయే గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మె గురించి విస్తృతస్థాయిలో చర్చించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు, జిల్లా సెక్రటరీ నాగమణి, జి.నాగమాధవి, టి.చిట్టి, ఎస్.సత్యవతి, వి.ధనలక్ష్మి, షేక్ మౌలాలి, శివకుమార్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఈ నెల 16వ తేదీన నిర్వహించే గ్రామీణ బంద్ను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, న్యూ డెమోక్రసీ నాయకులు వెట్టి సుబ్బన్న పిలుపునిచ్చారు. మండలంలోని వర్తక, వాణిజ్య, వ్యాపార సంస్థలకు ముందస్తుగా బుధవారం ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి వెట్టి సుబ్బన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎన్వి.అప్పారావు, చిట్టిబొమ్మ కొండలరావు, సిరిబత్తుల సీతారామయ్య, న్యూ డెమోక్రసీ నాయకులు కట్నం నాగేశ్వరావు పాల్గొన్నారు.

చింతలపూడి : ఈ నెల 16వ తేదీన దేశ వ్యాప్త గ్రామీణ బంద్, కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్వి.సత్యనారాయణ, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య పిలుపునిచ్చారు. పట్టణంలో సిపిఐ కార్యాలయం వద్ద రైతు కార్మిక సంఘాల సమావేశం ఎఐకె కెఎస్.రాష్ట్ర అధ్యక్షులు డి.రంగనాథ్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్వి.సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి ఎం.బాలరాజు, ఎఐటియుసి జిల్లా కో-కన్వీనర్ తోర్లపాటి బాబు, ఆశావర్కర్స్ యూనియన్ నాయకురాలు హెచ్.సుందరి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు జి.అంజమ్మ, సరోజినీ మాణిక్యం పాల్గొన్నారు.

కలిదిండి : ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని పెదలంక, మూలలంక, భాస్కరరావు పేట, గుర్వాయిపాలెం, చినతాడినాడ, పోతుమర్రు, కోరుకొల్లు, సానా రుద్రవరం, కలిదిండి గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు శేషపు మహంకాళిరావు, షేక్ అబిదా బేగం, పి.ప్రకాష్, వి.భాస్కరరావు, ఎ.వెంకటేశ్వరరావు, చిన్నం శ్రీకాంత్, ఎ.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, జ్యానేష, జి.సోమయ్య పాల్గొన్నారు.

ఉంగుటూరు : రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 16న జరిగే నిరసన కార్యక్రమాలకు సంబంధించి కరపత్రాలను సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు కైకరంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నిడమర్రు : నిడమర్రు, అడవికొలను, భువనపల్లి గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కంచ వరప్రసాద్, కమిలి నాని, రైతు సంఘం నాయకులు కానూరు రాజు, వెలగలేటి మోహన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి - టి.నరసాపురం

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని జెడ్పిటిసి సభ్యులు సామంతపూడి బాలసూర్యనారాయణరాజు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం చెత్త సేకరణ డస్ట్ బిన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 40,500 డస్ట్ బిన్లు వచ్చినట్లు ఆయన తెలిపారు. తడి, పొడి చెత్త సేకరించడానికి ప్రతి ఇంటికి రెండు డస్ట్ బిన్లు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దారబోయిన లక్ష్మి, వెంకటేశ్వరరావు, స్థానిక సర్పంచి మోదుగు సునంద, ఎంపిటిసి సభ్యులు నార్లపాటి వెంకటేశ్వరరావు, అర్జా బాలయ్య, ఎంపిడిఒ కె.జోగేశ్వరరావు, పంచాయతీ విస్తరణాధికారి రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు జాబ్మేళా

ప్రజాశక్తి - భీమడోలు

జపాన్ దేశానికి చెందిన లిక్సిల్ ఇండియా శానిటరీ వేర్ (భీమడోలు మండలం అంబర్పేట కేంద్రంగా పనిచేస్తున్న) సంస్థ మహిళా సాధికారికతకు ప్రాధాన్యత ఇస్తూ జాబ్మేళా నిర్వహించడం అభినందనీయమని భీమడోలుకు చెందిన గీతాంజలి విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎం.గౌతమ్కుమార్ తెలిపారు. భీమడోలులోని గీతాంజలి కళాశాల వేదికగా బుధవారం కేంద్ర ప్రభుత్వ ఉపాధి కల్పన శాఖ, సెట్వెల్, జిల్లాకు చెందిన ఉపాధి కల్పన, శిక్షణా కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జాబ్మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకులకు కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ ఆర్.సత్యనారాయణ, ఉదయ్కిరణ్ సహకరించారు. లిక్సిల్ సంస్థలో ప్రపంచవ్యాప్తంగా 80 శాతం వరకు మహిళలు ఉన్న నేపథ్యంలో అదే ఒరవడిని స్థానికంగా అమలు చేసేందుకు ఉపాధి కల్పనలో మహిళలకు ప్రాధాన్యతను ఇస్తున్నట్లు ఆ సంస్థ మానవ వనరుల విభాగం అధికారులు రామ్మోహన్రావు, లోకేష్ తెలిపారు. మహిళలకు సంస్థ నిబంధనల మేరకు వివిధ సౌకర్యాలు కల్పిస్తూ రూ.17 వేల వరకు వేతనం ఉంటుందని, వారి అనుభవం, సామర్థ్యం ప్రదర్శన ఆధారంగా మరింత ఎక్కువగా వేతనాలు ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి మధు భూషణరావు, ఎన్సిఎస్ కో-ఆర్డినేటర్ జి.ప్రవీణకృష్ణ హాజరయ్యారు.

In the Court of the Honourable Principal Senior Civil Judge at Anakapalle
E.P. No. 9/2022 in O.S. No. 379/2018
(On the file of Honourable Ist Additional Senior Civil Judge, Kakinada)
Between:
Bhagavathula Gopala Krishna Murthy ...Decree Holder
AND
Suresetti Lavanya and another ...Judgement Debtors
To:
1st Judgement Debtor:
Surisetti Lavanya, D/o. Appalanaidu, Door No. 1-144/1, Near Krishna Temple, Kalaparru, Pedapadu Mandalam, Bheemavaram J.C.J., West Godavari District.
పై నెంబరు అమలు గ్రంధములో 1వ JDr అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసారుల నోటీసులు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 06-3-2024వ సం॥ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, అనకాపల్లి వారి కోర్టు ఎదుట మీరు స్వయంగా గానీ, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై అమలు గ్రంధము మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
CHANDAKA VEERA KRISHNA
Advocate, Anakapalle
D.SUBRAHMANYAM
Advovate, Bhanugudi Centre
Kakinada, Cell: 9849715132

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్క్రాస్ తల సేమియా భవనంలో బుధవారం 12 మంది చిన్నారులకు రక్తమార్పిడి నిర్వహించామని ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రత్యేకమైన ఫిల్టర్ సెట్స్ ద్వారా తలసేమియా రోగులకు సురక్షితంగా రక్త మార్పిడి నిర్వహిస్తున్నామని, సరిపడా రక్త యూనిట్లను అందుబాటులో ఉండేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తలసేమియా చిన్నారులకు, వారి సహాయకులకు మానవత డైరెక్టర్ దేవినేని భాస్కరరావు ఉచిత భోజనం ఏర్పాటు చేశారని తెలిపి, వారికి అభినందనలు తెలిపారు. డాక్టర్ ఆర్ఎస్ఆర్కె.వరప్రసాదరావు, మానవత డైరెక్టర్ దేవినేని భాస్కరరావు, ట్రెజరర్ అల్లూరి మోహిని, రత్నాకరరావు, బిఆర్సిహెచ్.నారాయణ, టి.రామారావు పాల్గొన్నారు.

ఏలూరు లయన్స్ క్లబ్, సర్ సిఆర్ఆర్ ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో సిఆర్రెడ్డి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 40 మంది విద్యార్థులు రక్తదానం చేశారని కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల కరస్పాండెంట్ కెఎ. విష్ణు మోహన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వర ప్రసా దరావు, సిఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెఎ.రామ రాజు, ఏలూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు కడియం ప్రసాద్ బాబు, కార్యదర్శి ఎం.చలపతిరావు, ఇమ్మానుయేలు, ఎన్సిసి అధి కారి ఎం.నవీన్కుమార్, పిఆర్ఒ కెవి.రమణ పాల్గొన్నారు.

బోర్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వేసవి కాలం రానున్న నేపథ్యంలో రైతులు తమ తమ వ్యవసాయ బోర్లకు విధిగా కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని జంగారెడ్డిగూడెం డివిజన్ ఎలక్ట్రికల్ డిఇ పి.రాధాకృష్ణ తెలిపారు. మండలంలోని పాలచర్ల ఫీడర్కు ఓవర్ లోడ్ అయ్యి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్న దృష్ట్యా రెండు ఫీడర్లుగా విభజించే కార్యక్రమంలో ఆయన పాల్గొని ఫిడర్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కన్స్ట్రక్షన్ ఎడి శ్రీనివాస్, జెఇ హరిబాబు, ఎల్ఐలు కన్నబాబు, వెంకటరత్నం, పండు, రాంబాబు పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో పిహెచ్సి ప్రారంభం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆగిరిపల్లిలో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు బుధవారం ప్రారంభించారు. అనంతరం జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా వాటర్ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.అనూష, జెడ్పిటిసి సభ్యులు పి.వీరబాబు, వైద్యాధికారి జగన్మోహన్రావు, ఎంపిడిఒ పి.శామ్యూల్ పాల్గొన్నారు.

మినుము పైరు పరిశీలన

ముదినేపల్లి : మండలంలోని అల్లూరు గ్రామంలో నీళ్ల లేక ఎండిపోతున్న మినుము పైరును తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పైరుకు నీరు విడుదల చేయడంతో పాటు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

AUCTION - NOTICE
IN THE HON'BLE SENIOR CIVIL JUDGE COURT :AT NUZVID:
E.P.No : 44 OF 2014 IN L.A.O.P.No : 80 OF 2002
BETWEEN
Meka Amrutha & Others ... D.H.R's / Claimants
AND
Revenue Divisional Offiçer, Nuzvid.. J.D.R. / Referring officer
The following scheduled properties belongong to The above named J.D.R is been set for public auction on the date 22.03.2024 by 10.30 A.M towards the balance amount to be paid to DHR's. Hence the potential buyers are invited to attend on the said date and buy below movable properties of JDR at Auction in Court premises, located at Nuzvid.
Schedule
1 . Bolero Jeep VAN bearing no. AP 16 BN 3546 - Rs. 1,00,000.00/-
2 . Window A.C. in Sub-Collector Chamber - Rs. 10,000.00/-
3 . Computers - 10 in number - Rs. 30,000.00/-
4 . Ceiling fans - 10 in number - Rs. 3,000.00/-
5 . Iron safes - 10 in number - Rs. 10,000.00/-
6. Chairs - 15 in number - Rs. 10,000.00/-
7. Wooden Tables - 15 in number - Rs. 3,000.00/-
D.H.R. Value : Rs. 1,66,000.00/-
Ameena Value : Rs. 1,98,600.00/-
SD/- BY THE ORDER OF THE COURT
Forwarded By:
Gangavelli. Rambabu & Murala. Gopinadh, Advocates for DHR's.

వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కుక్కునూరు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైసిపి మండలాధ్యక్షులు కుచర్లపాటి నరసింహరాజు, సర్పంచి రావు మీనావినోద్ అధ్యక్షతన వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసిపి పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి బాలరాజు, ఏలూరు పార్లమె ంట్ నూతన అభ్యర్థి సమన్వయకర్త కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం ద్వారా లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలను రూపొందించిన ఘనత సిఎం జగన్దేనని వైసిపి చింతలపూడి నియోజకవర్గ ఇన్ఛార్జి కంభం విజయరాజు అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో రోటరీ క్లబ్ ఫంక్షన్ హాలులో బుధవారం నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

కళాశాలలో బ్లాక్ డే

ప్రజాశక్తి - భీమడోలు

ఎబివిపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో భీమడోలు మాధురి కళాశాలలో విద్యార్థుల భాగస్వామ్యంతో బుధవారం బ్లాక్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎబివిపి జిల్లా స్టూడెంట్ ఫర్ డెవలప్మెంట్ కన్వీనర్ సాయి రాంరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్ల క్రితం ఇదే రోజున ఉగ్రవాదుల దాడుల్లో 40 మంది సిఆర్పిఎఫ్ జవాన్లు అమరులయ్యారని తెలిపారు. వారి సంస్మరణార్థం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భూ హక్కుపై అవగాహన

ప్రజాశక్తి - ముసునూరు

జగనన్న భూ హక్కు భూ సర్వేపై మండలంలోని కోర్లగుంట గ్రామంలో గ్రామ సచివాలయంలో సర్వేయర్ సురేష్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించినట్లు తహశీల్దార్ జవహర్బాజి తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ పద్మావతి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ తణుకు Ist అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 524/2023
Between:
వాది: సాలాపు రాజేష్
&
ప్రతివాదు: 1. సోబేటి శ్రీను, S/o. ప్రసాద్, డో.నెం. 2-112, రాచపట్నం, కైకలూరు మండలం, ఏలూరు జిల్లా.
2. సోబేటి పుజిత, W/o. శ్రీను, డో.నెం. 2-112, రాచపట్నం, కైకలూరు మండలం, ఏలూరు జిల్లా.
వాది తరపున దాఖలు చేసిన పేపరు ప్రకటన
పై నెంబరు దావాలో ప్రతివాద్దులకు I.A. 1733/2023 రులో రెస్పాండెంట్సు అయిన మీకు దావా సమన్సును, I.A. లో నోటీసులు శ్రీ కోర్టు ద్వారా మరియు రిజిష్టర్డు పోస్టు ద్వారా పలుమార్లు పంపించినన్నూ అవి మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున మీరు పై కోర్టు వారి ఎదుట **ది. 23-2-2024వ సం॥ తేదీన ఉదయం 10.30 గం॥ ని॥లకు** హాజరు కావలెను. మీరు స్వయంగా గానీ, మీ తరపు ప్లీడరు గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపర్చుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించెదరు అని మీకు పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
బి.శైలాకుమారి
తణుకు వాది తరపు అడ్వకేటు
13-2-24 తణుకు, సెల్: 99492 99166

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ 1వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు
ఎం.వి.ఓ.పి నెం. 415/2023
బిట్వీన్:
దాసరి రాములమ్మ & 2 others ...పిటిషనర్స్
మరియు
జితేంద్ర రామ్ & 2 others ...రెస్పాండెంట్స్
టు:
2వ రెస్పాండెంట్:
SBM ట్రాన్స్పోర్ట్ అప్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫ్లాట్ నెంబర్.3, C-బ్లాక్, 10వ ఫ్లోర్, సన్నీవ్యాలీ అపార్ట్మెంట్స్ నెంబర్.351, కొన్నూర్ హై రోడ్, అయ్యన్నవరం, చెన్నై, తమిళనాడు. లారీ ఓనర్ బేరింగ్ నెం. KA 01 AC 9147.
పై నెంబర్ గ్రంథములో మీరు 2వ రెస్పాండెంట్ అయి ఉన్నారు. మేము ఎన్నిసార్లు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువలన శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పత్రిక ముఖముగా తెలియజేయునది ఏమనగా, **ది. 28-02-2024వ తేదీన** పై నెంబరు గ్రంథములో శ్రీ కోర్టు వారి ఎదుట మీ హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది. కావున ఆరోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయముగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోన వలెను. లేనియెడల సదురు పై నెంబర్ గ్రంథములో మీయొక్క పరోక్షముగా విచారించబడును.
మాగంటి లక్ష్మణ్ కుమార్,
కె.వి.ఎస్.సోమయాజి
న్యాయవాదులు, ఏలూరు సెల్:9885279889

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ 1వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు
ఎం.వి.ఓ.పి నెం. 415/2023
బిట్వీన్:
దాసరి రాములమ్మ & 2 others ...పిటిషనర్స్
మరియు
జితేంద్ర రామ్ & 2 others ...రెస్పాండెంట్స్
టు:
1వ రెస్పాండెంట్:
జితేంద్ర రామ, తండ్రి: శ్రీ రాంజీ రామ, హిందూ, మగ, వయస్సు 55 సం॥లు, లారీ డ్రైవర్, లారీ డ్రైవర్ బేరింగ్ నెం. KA 01 AC 9147, అడ్రస్: సన్వర్బా గ్రామం, బైరా మండలం, బాలియా జిల్లా, ఉత్తరప్రదేశ్.
పై నెంబర్ గ్రంథములో మీరు 1వ రెస్పాండెంట్ అయి ఉన్నారు. మేము ఎన్నిసార్లు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువలన శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పత్రిక ముఖముగా తెలియజేయునది ఏమనగా, **ది. 28-02-2024వ తేదీన** పై నెంబరు గ్రంథములో శ్రీ కోర్టు వారి ఎదుట మీ హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది. కావున ఆరోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయముగా గాని లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోన వలెను. లేనియెడల సదురు పై నెంబర్ గ్రంథములో మీయొక్క పరోక్షముగా విచారించబడును.
మాగంటి లక్ష్మణ్ కుమార్,
కె.వి.ఎస్.సోమయాజి
న్యాయవాదులు, ఏలూరు సెల్:9885279889